క్లుప్తంగా

నేడు, రేపు భగీరథ నీటి సరఫరా బంద్

హుస్నాబాద్: పట్టణంలో ఈనెల 11, 12వ తేదీల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాను నిలిపి వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పైపు లైన్ మరమ్మతుల దృష్ట్యా నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. పట్టణ ప్రజలు గమనించి మున్సిపల్, వాటర్ సరఫరా సిబ్బందికి సహకరించాలని కోరారు. తాగునీరు అత్యవసరంగా కావల్సినవారు నీటి సరఫరా సిబ్బంది బూరుగు రవి 99894 69957, మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ 73373 12136 నంబర్లలో సంప్రదించాలన్నారు.

108 సేవలను సద్వినియోగం చేసుకోవాలి



108 వాహనాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా మేనేజరు జనార్దన్

హుస్నాబాద్‌రూరల్: అత్యవసర వైద్యసేవల కోసం ప్రవేశపెట్టిన 108, 102, 1962 వాహనాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జనార్దన్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ ఆస్పత్రిలోని 108, 102 వాహనాలను తనిఖీ చేసి వాటి పనితీరు తెలుసుకున్నారు. గ్రామీణ ప్రజలకు సేవలు అందించడానికి సిబ్బంది ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ నాయకులు

కోహెడరూరల్(హుస్నాబాద్): డీటీఎఫ్ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక రజతోత్సవ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ డీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మహాసభల వాల్ పోస్టర్‌ను మండలంలోని మైసంపల్లి గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఉల్లి సమ్మయ్య మాట్లాడుతూ అక్టోబర్ 15, 16, 17 తేదీలల్లో రాష్ట్ర మహాసభలు మహబూబ్ నగర్ పట్టణంలో జరగనున్నాయన్నారు. మహాసభలో విద్యారంగంలో వస్తున్న ధోరణులు విద్యారంగ, వృత్తి సమస్యలు, సామాజిక అంశాలపై చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు, కార్యదర్శులు హనుమల రవీందర్‌రెడ్డి, సత్తయ్య తదితరులు ఉన్నారు.

హెచ్ఎంలకు సన్మానం



బెజ్జంకిలో ప్రధానోపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

బెజ్జంకి(సిద్దిపేట): ఎస్టీయూ, టీటీఎఫ్, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం బెజ్జంకిలో బదిలీలపై వచ్చిన పీజీహెచ్ఎం, హెచ్ఎంలను, జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన దాచారం పీఎస్ ఉపాధ్యాయుడు ఐలేని రజనీష్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈఓ పావని, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పుల్లూరి ప్రభాకర్, వడ్లకొండ శ్రీనివాస్, రామంచ రవి, ప్రవీణ్‌కుమార్, గిరిబాబు, శంకరాచారి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి తరలివెళ్లిన నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి కేటీఆర్ అధ్యక్షతన జరిగిన బీఆర్ఎస్ పార్టీ సమావేశానికి మండలానికి చెందిన నాయకులు, సర్పంచ్‌లు, గ్రామశాఖ అధ్యక్షులు మంగళవారం తరలివెళ్లారు. ఈ సమావేశంలో జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి, పల్లా రాజేశ్వర్ రెడ్డి మధ్య సయోధ్య కుదిర్చి జనగామ బీఆర్ఎస్ టికెట్ పల్లా రాజేశ్వర్ రెడ్డి కేటాయిస్తున్నట్లు మంత్రి ప్రకటించినట్లు సమాచారం. సమావేశానికి హాజరయ్యేందుకు వెళ్లిన వారిలో జెడ్పీటీసీ సిద్దప్ప, సర్పంచ్‌లు స్వామి, కృష్ణారెడ్డి, నాయకుడు మెరుగు కృష్ణ ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కొండపాక(గజ్వేల్): మండలంలోని దమ్మక్కపల్లి గ్రామంలో మంగళవారం ఓ ప్రైవేటు ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నీల మల్లేశం మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో 120 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు అఖిల, బషీర్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో నిర్ణయాలు అనర్థం



సిద్దిపేటలో మాట్లాడుతున్న డాక్టర్ ఆదిత్య కశ్యప్

- మానసికంగా ధృఢంగా ఉండాలి
- సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలి
- మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ ఆదిత్య కశ్యప్

సిద్దిపేట ఎడ్యుకేషన్: విద్యార్థులు మానసికంగా ధృఢంగా ఉండాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే విధంగా కృషి చేయాలని మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ ఆదిత్య కశ్యప్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని కళాశాల హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్, లయన్స్ క్లబ్ సిద్దిపేట స్ఫూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకుండటంతో అనర్థాలు జరుగుతున్నాయన్నారు. ప్రతీ ఒక్కరూ మానసికంగా బలంగా ఉండాలన్నారు. మానసికంగా అనారోగ్యంగా ఉంటే వెంటనే మానసిక వైద్యులను సంప్రదించాలన్నారు. సెల్‌ఫోన్‌ల వాడకం తక్కువగా ఉండే విధంగా విద్యార్థులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసాద్, డాక్టర్ రామ్మోహన్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు సత్యనారాయణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ గోపాల సుదర్శన్, లయన్స్ క్లబ్ సభ్యుడు మామిడాల శ్రీనివాస్, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస్, జంతుశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ అయోధ్య రెడ్డి, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ కన్వీనర్ విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుల పిల్లలకు పండ్లు పంపిణీ చేస్తున్న జడ్జి కృష్ణతేజ్

దివ్యాంగుల పిల్లలను చక్కగా చూసుకోవాలి

హుస్నాబాద్: భవిత కేంద్రంలో చదువుకునే దివ్యాంగుల పిల్లలను చక్కగా చూసుకోవాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని భవిత కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం దివ్యాంగుల పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల పిల్లలకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. ఆట వస్తువులతో పాఠాలు బోధించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, ఏజీపీ కన్నోజు రామకృష్ణ, ఎంఈఓ దేశిరెడ్డి, అడ్వకేట్ రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉరుకుల పరుగుల జీవితంలో ..

సిద్దిపేటఅర్బన్: నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎంతో ముఖ్యమని సురభి కళాశాల మానసిక వైద్యనిపుణుడు డాక్టర్ పిన్నోజి హరీశ్ అన్నారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలోని సురభి వైద్య విజ్ఞాన సంస్థలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. నేటి ఆహారపు అలవాట్లు, ధూమపానం, మద్యపానం, ఆలోచనా విధానం, పనిలో ఉండే ఒత్తిడి వల్ల కలిగే మానసిక స్థితిగతుల గురించి డాక్టర్లు వివరించారు. యోగా చేయడం, డాక్టర్ల సలహాలు సూచనలను పాటిస్తే మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. కార్యక్రమంలో హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ శివరామాచారి, డాక్టర్ రాజేష్, డాక్టర్ రఫీ, కళాశాల పీఆర్వో పరశు రాములు తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య రక్షణకు కృషి చేయాలి

గజ్వేల్‌రూరల్: ప్రపంచ వ్యాప్తంగా ఎనిమిది మందిలో ఒకరు మానసిక రోగంతో బాధపడుతున్నారని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సౌమ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం గజ్వేల్‌లోని ప్రత్యేక అవసరాలుగల పిల్లల మానవ వనరుల కేంద్రంలో గజ్వేల్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. మానసిక ఆరోగ్యమనేది ఆరోగ్య హక్కులో అంతర్భాగమన్నారు. మానసిక ఆరోగ్య పరిస్థితులు పెరుగుతున్న కౌమార దశలు, యువకులను కూడా ప్రభావితం చేస్తున్నాయన్నారు. మానసిక ఆరోగ్య రక్షణకు కృషి చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంక్షేమ సమితి సభ్యులు దేశబోయిన నర్సింలు, మండల లీగల్ సర్వీస్ సిబ్బంది నర్సింహాచారి, యామిని, ప్రత్యేక అవసరాలుగల పిల్లల మానవ వనరుల కేంద్రం నిర్వాహకురాలు హరిత, రమ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన మర్మాముల ఎన్ఆర్ఐ



నిష్కాంత్‌రెడ్డికి పార్టీ కండువా వేస్తున్న ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని మర్మాముల గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ఇప్ప నిష్కాంత్‌రెడ్డి 200 మందితో కలిసి మద్దూరు ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పల్లా నిష్కాంత్‌రెడ్డికి పార్టీ కండువా కప్పి పల్లా రాజేశ్వర్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిష్కాంత్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు డాకూరి తిరుపతిరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు కూసరాజు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి మండలం ఎనగుర్తి గ్రామానికి చెందిన 20 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల హృదయాల్లో నిలుస్తాయన్నారు. బీజేపీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్ పాల్గొన్నారు.

దుబ్బాక: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని మల్లాయపల్లి వార్డుకు చెందిన యాదవ మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్ యాదవ్ బీజేపీని వీడి బీఆర్ఎస్‌లోకి చేరారు. మంగళవారం ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు.

బజాజ్ ఎన్150 బైక్ విడుదల



సెలక్ట్ బజాజ్ ఎన్150 బైక్‌ను విడుదల చేస్తున్న ఏఎంసీ చైర్మన్ మచ్చ విజిత వేణుగోపాల్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సెలక్ట్ బజాజ్ ఎన్ 150 బైక్‌ను మంగళవారం సిద్దిపేట బజాజ్ షోరూంలో ఏఎంసీ చైర్మన్ మచ్చ విజిత వేణుగోపాల్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోటారు వాహన రంగంలో ఎప్పటికప్పుడు కొత్తదనంలో దూసుకుపోతున్న సెలెక్ట్ బజాజ్‌లో మరో మోడల్ అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు. నేటి యువతకు సరిపోయే విధంగా రకరకాల మోడళ్లను తీసుకురావడంలో బజాజ్ ముందుంటుందన్నారు. బజాజ్ ఎన్ 150 బైక్ రూ.1,18,054తో అందుబాటు ధరలో ఉండటం ఆహ్వానించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో సెలెక్ట్ బజాజ్ ఎండీ విజయ్ కుమార్ రెడ్డి, హరీష్‌రెడ్డి, సెలెక్ట్ బజాజ్ సిద్దిపేట షోరూం మేనేజర్ బత్తుల రమేష్ రెడ్డి, షోరూం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లిలో సినిమా షూటింగ్



సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న యూనిట్ సభ్యులు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లాది వెంకటేశ్వర సినీ క్రియేషన్స్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న దుమారం సినిమా షూటింగ్ మంగళవారం జరిగింది. ఆలయ పరిసరాలలో మూడు రోజుల పాటు చిత్రీకరిస్తున్నట్లు యూనిట్ సభ్యులు తెలిపారు. ప్రధాన పాత్రలో హీరోగా సుమన్ నటిస్తున్నారు. గీతాసింగ్, సూర్య, తిరుపతి, పాండు, మల్లిక్ నటిస్తుండగా, జీఎల్‌బీ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు.

పోలీసుల తనిఖీలు

చిన్నకోడూరు(సిద్దిపేట): శాసనసభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో చిన్నకోడూరు పోలీసులు జిల్లా సరిహద్దులో మంగళవారం ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. వాహనాలు తనిఖీ చేసి, ధ్రువపత్రాలు లేని నగదును స్వాధీనం చేసుకున్నారు.



జక్కాపూర్ వద్ద కారును తనిఖీ చేస్తున్న ఎస్ఐ సుభాశ్ గౌడ్

జెండాలు, పోస్టర్ల తొలగింపు



అప్పాయిపల్లిలో పెయింట్ వేస్తున్న సిబ్బంది

మద్దూరు(హుస్నాబాద్): సాధారణ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో అధికారులు చర్యలు చేపట్టారు. మద్దూరు, దూళ్మిట్ట మండలాల్లోని వివిధ రాజకీయ పార్టీల సంబంధించిన జెండాలు, పోస్టర్లు, ఫ్లెక్సీలను సిబ్బందితో తొలగించారు.

కొమురవెల్లి(సిద్దిపేట): ఎన్నికల కోడ్ రావడంతో జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మండలంలోని కొమురవెల్లి, కిష్టంపేట, గౌరయపల్లి, మర్రిముచ్చాల గ్రామాలలో వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన జెండాలు, వాల్ రైటింగ్స్, ఫ్లెక్సీలను మంగళవారం తొలగించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఆర్ఐ శ్రీనివాస్, కార్యదర్శులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్(దుబ్బాక): తెలంగాణలో ఎన్నికల కోడ్ అమలులో భాగంగా అధికారులు రాజకీయ పార్టీల నాయకుల వాల్ పోస్టర్లు, వాల్ పెయింటింగ్ తొలగించే పనిలో పడ్డారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం మండల పరిధిలోని అప్పాయిపల్లిలో వాల్ పోస్టర్లను తొలగించి, వాల్ పెయింటిగ్‌పై పంచాయతీ అధికారి ప్రవీణ్ సిబ్బందితో పెయింట్ వేయించారు.

కేసీఆర్ సహకారంతో మౌలిక వసతుల కల్పన

మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



మాట్లాడుతున్న మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజా సమస్యలను పరిష్కరించి మళ్లీ మీ దగ్గరకు వచ్చా ఆశీర్వదించాలని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కల్లెపెల్లి గ్రామస్తులను కోరారు. మండలంలోని కల్లెపెల్లిలో మంగళవారం రాత్రి ఆశీర్వాద సభ నిర్వహించారు. ఆయనకు బోనాలు, బతుకమ్మలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మొదటి ఆశీర్వద సభ ఇక్కడే పెట్టానన్నారు. గ్రామంలో సంక్షేమ పథకాలు అమలు సీఎం కేసీఆర్ సహకారంతో చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. తన ఆటాపాటలతో ప్రజలను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, జెడ్పీటీసీ కనగండ్ల కవిత, రాజన్న సిరిసిల్ల జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ సిద్దం వేణు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కచ్చు చంద్రకళ, వైస్‌ఎంపీపీ చెలుకల సబిత, సర్పంచ్ దారం లక్ష్మీ, ఏఎంసీ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీ చేపట్టాలి

గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘాల డిమాండ్



ధర్నా చేస్తున్న గొల్ల, కురుమలు

హుస్నాబాద్: రెండో విడత గొర్రెల పంపిణీని త్వరగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ పశువైద్యశాల ఆస్పత్రి ఎదుట గొర్రెల పెంపకందారులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో రెండో విడత గొర్రెల పంపిణీ కోసం డీడీలు కట్టి ఎదురు చూస్తున్నామన్నారు. పట్టణంలో ఉన్న రెండు గొర్రెల పెంపకందారుల సహకార సంఘం సభ్యులు 180 మంది డీడీలు తీసి 5 నెలలు గడుస్తోందన్నారు. ఏడీకి ఫోన్ చేస్తే అక్టోబర్ చివరి నాటికి గొర్రెల పంపిణీ జరుగుతుందని చెప్పారన్నారు. తొలి విడతలో భాగంగా గొర్రెల పంపిణీలో చనిపోయిన గొర్రెలకు బీమా రాలేదన్నారు. హుస్నాబాద్ పర్యటనకు వచ్చిన మంత్రి హరీశ్‌రావును కలిసి విన్నవించగా, ఈనెల చివరి నాటికి గొర్రెలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో గట్టు మల్లికార్జున స్వామి గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు చౌదరి అశోక్, హుస్నాబాద్ గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు కాశబోయిన సంపత్, కౌన్సిలర్లు వల్లపు రాజు, మ్యాదరబోయిన వేణు, ఆయా సంఘాల నాయకులు గొర్ల లింగన్న, మేకల వీరన్న యాదవ్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **మాజీ మంత్రికి నివాళి**



చిన్నకోడూరు(సిద్దిపేట): మాజీ మంత్రి, ప్రజాకవి ముచ్చర్ల సత్యనారాయణ యాదవ్ వర్ధంతి మంగళవారం చిన్నకోడూరులో నిర్వహించారు. నాయకులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సత్యనారాయణ నిరంతరం బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషిచేశారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్, నాయకులు మార్క సతీష్, మహేందర్, పర్శ రాములు, గణేష్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

◆ **బీఆర్ఎస్‌తోనే పేదలకు న్యాయం**



చిన్నకోడూరు(సిద్దిపేట): బీఆర్ఎస్‌తోనే పేదల న్యాయం జరుగుతుందని ఎంపీపీ కూర మాణిక్య రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం చిన్నకోడూరులో మండల ఏకలవ్య ఎరుకల సంఘం సభ్యులు మంత్రి హరీశ్‌రావుకు మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం కులవృత్తులకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతుంతోందని, ప్రభుత్వ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాపయ్య, సర్పంచ్ ఉమేష్ చంద్ర, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, స్థానిక నాయకుడు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు**



చేర్యాల(సిద్దిపేట): హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో మంగళవారం జనగామ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో మంత్రి కేటీఆర్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని జనగామ బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేశారు. పట్టణ కేంద్రంలో బాణా సంచాలు కాల్చి సంబురాలు జరుపుకున్నారు.

◆ **కొనసాగుతున్న దీక్షలు**



చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలంటూ పాత బస్టాండ్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 30వ రోజుకు చేరాయి. దీక్షలో జిల్లా ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం అధ్యక్షుడు దొంతుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఫొటో, వీడియో గ్రాఫర్లు కూర్చొని సంఘీభావం తెలిపారు.

◆ **'ఓట్లు అడిగే హక్కు బీఆర్ఎస్‌కు లేదు'**

అక్కన్నపేట(హుస్నాబాద్): 'బీఆర్ఎస్ పార్టీకి ఓట్లు అడిగే హక్కు లేదని, ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కల గౌరవెల్లి ప్రాజెక్టు ప్రారంభించాకే ఓట్లు అడగాలని' కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఎన్నికల ఆశ్వీరాద సభలో సీఎం కేసీఆర్ కుర్చీ వేసుకొని గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేసి 1.6 ఎకరాలకు సాగు నీరు అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. మరోసారి మోసం చేసేందుకు వస్తున్న కేసీఆర్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయే అని ధీమా వ్యక్తం చేశారు.

◆ **ఆరోపణల్లో నిజం లేదు**

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్‌లో గృహలక్ష్మీ పత్రాల పంపిణీ అనంతరం గృహలక్ష్మీ పథకం రాని మహిళలు ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీని నిలదీశారు. గ్రామ ప్రజాప్రతినిధులకు మాత్రమే గృహలక్ష్మీ మంజూరు చేశారని ఆరోపించగా.. మంగళవారం ఎంపీటీసీ కవితా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబంలో ఎవరికీ గృహలక్ష్మీ పథకం రాలేదని, సదరు మహిళలు చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. జగదేవ్‌పూర్ అభివృద్ధిలో తమవంతు పాత్రను పోషిస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందించామని తెలిపారు.

◆ **పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడికి సన్మానం**



జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని మునిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు శశిధర్ శర్మ బదిలీలో భాగంగా మంగళవారం వర్గల్ మండలం చౌదరిపల్లి పాఠశాలకు వెళ్లారు. దీంతో విద్యార్థులు ఆయనను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో హెచ్ఎం రహీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్గల్(గజ్వేల్): మండలంలోని చౌదరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చిన పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు అదరాసుపల్లి శశిధర్‌శర్మకు ఆ సంఘం వర్గల్ మండల బాధ్యులు, ఉపాధ్యాయులు ఆత్మీయ స్వాగతం పలికారు. ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు. ఈయన జగదేవపూర్ మండలంలో పనిచేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ వర్గల్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, హెచ్ఎం వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ **సెల్‌ఫోన్ అందజేత**

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట భూంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోతారెడ్డిపేట గ్రామానికి చెందిన చంద్రకళ నెలక్రితం చిట్టాపూర్‌కు ఆటోలో వెళ్లి తన సెల్‌ఫోన్ పాగొట్టుకుంది. బాధితురాలు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా సీఈఐఈఆర్ ద్వారా గుర్తించి ఫోన్ గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం బాధితురాలికి ఫోన్ అందజేసినట్లు ఎస్ఐ భువనేశ్వర్‌రావు తెలిపారు.

◆ **విద్యార్థులకు బ్యాగులు అందజేత**

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని ఇటిక్యాల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సామాజిక కార్యకర్త ఎర్రోల్ల అనిల్ విద్యార్థులకు బ్యాగులను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం శంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జూవేదా బేగం అయూబ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

